## క్లుప్తంగా

### నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఐనవోలు : ఐనవోలు, కొండపర్తి, గర్మిళ్లపల్లి సబ్‌స్టేషన్‌ల పరిధిలో చెట్టు కొమ్మల తొలగింపు, లైన్ మరమ్మతుల కారణంగా శుక్రవారం విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు ఏఈ పద్మ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. నాగపురం, కొండపర్తి గర్మిళ్లపల్లికి ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

### ఒకరి అరెస్టు

పరకాల : మండలంలోని కామారెడ్డిపల్లి శివారులో నాటుసారా తయారీ చేస్తున్న ఒకరిని అరెస్టు చేసి, బెల్లంపానకం ధ్వంసం చేసినట్లు ఎక్సైజ్‌శాఖ సీఐ తాతాజీ తెలిపారు. గుడుంబా తయారీ చేస్తున్న గ్రామానికి చెందిన అల్లె రాజును తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు పేర్కొన్నారు. గుడుంబా తయారీ చేసినా, విక్రయించినా చర్యలు తప్పవన్నారు. హెడ్‌కానిస్టేబుల్ లక్ష్మణాచారి, కానిస్టేబుళ్లు ప్రశాంత్, వరుణ్‌రెడ్డి పాల్గొన్నారు.

### వందపడకల ఆస్పత్రిగా మార్చాలి

ఎల్కతుర్తి : మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని 100 పడకల ఆస్పత్రిగా మార్చాలని ధర్మసమాజ్ పార్టీ మండల కన్వీనర్ బొంకూరి రాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో గురువారం విలేకరులతో మాట్లాడారు. హనుమకొండ, సిద్దిపేట, కరీంనగర్ మూడు జిల్లాల సరిహద్దు ప్రాంతంలో ఉన్న ఎల్కతుర్తి మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిని వందపడకల ఆస్పత్రిగా మార్చి, ల్యాబొరేటరీ సౌకర్యం కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. హుస్నాబాద్ ఎమ్మెల్యే, రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ దృష్టిసారించాలని కోరారు. సుదర్శన్, ప్రభాకర్, విజయ్, రాజేందర్, ప్రవీణ్ పాల్గొన్నారు.

### టిప్పర్ డ్రైవర్‌పై కేసు నమోదు

కమలాపూర్ : మండలంలోని శనిగరం శివారులో గల వాటర్‌ట్యాంకు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదానికి కారణమైన టిప్పర్ డ్రైవర్ బోరగాల కృష్ణయ్యపై కేసు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ హరికృష్ణ గురువారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. తోకల కృష్ణస్వామి అనే రైతు ఈనెల 11న తన వ్యవసాయ పనులు ముగించుకుని రాత్రి సమయంలో ఎడ్లబండి వెనకాల రెండు గేదెలను కట్టుకుని వస్తున్నాడు. ఈ క్రమంలో పరకాల వైపు నుంచి కమలాపూర్‌కు వస్తున్న (టీఎస్ 02 యూసీ 8419) నంబరు గల టిప్పర్ అతివేగంగా, అజాగ్రత్తగా వచ్చి ఎడ్లబండిని వెనుకవైపు నుంచి ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో రెండు గేదెలు అక్కడికక్కడే మృతి చెందగా ఎడ్ల బండిని లాగుతున్న రెండు ఎద్దుల కాళ్లు విరుగడంతో పాటు రైతు కృష్ణస్వామికి తీవ్ర గాయాలయ్యాయి. కృష్ణస్వామిని చికిత్స నిమిత్తం హనుమకొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. కృష్ణస్వామి భార్య అరుణ ఫిర్యాదు మేరకు టిప్పర్ డ్రైవర్ బోరగాల కృష్ణయ్యపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు. కాగా రైతు కృష్ణస్వామి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది.

### సర్వేను సక్రమంగా నిర్వహించాలి



ఐనవోలు : ఇంటింటా మిషన్ భగీరథ నల్లా సర్వే వివరాలు సరిగా నమోదు చేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ చీఫ్ ఇంజనీర్ శ్రీనివాస్‌రావు ఎన్యుమరేటర్లకు సూచించారు. గురువారం మండల వ్యాప్తంగా మిషన్ భగీరథ ఇంటింటా సర్వేను ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ సునీతతో కలిసి పరిశీలించారు. ఏఈ రవికుమార్, ఎంపీఓ రఘుపతిరెడ్డి, కార్యదర్శి, అంగన్‌వాడీలు, ఫీల్డ్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

### కార్మికులు సంఘటితంగా ఉంటేనే అభివృద్ధి

కాజీపేట అర్బన్: కార్మికులంతా సంఘటితంగా ఉంటేనే అభివృద్ధి సాధ్యమని బీఆర్‌ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్ అన్నారు. బాలసముద్రంలోని పార్టీ కార్యాలయంలో హమాలీ సంఘం నాయకులతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వంలో ఉన్నా లేకున్నా సంఘటిత, అసంఘటిత కార్మికుల సంక్షేమమే ధ్యేయంగా నిరంతరం పనిచేస్తానని చెప్పారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి కేటీఆర్‌ల సహకారంతో హనుమకొండ జిల్లాలో సుమారు రూ.6 కోట్లు విలువచేసే భూమిని కార్మిక సంఘం భవన నిర్మాణం కోసం కేటాయించినట్లు గుర్తుచేశారు. భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షుడు ఎంజాల మల్లేశం, మన తెలంగాణ ఆటో డ్రైవర్స్ యూనియన్ అధ్యక్షుడు సంజీవ్, ట్రేడ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు గాదర బోయిన కొమురయ్య, ఉపాధ్యక్షుడు గొంగళ్ల వెంకన్న, కార్యదర్శి రవి పాల్గొన్నారు.

# అసంపూర్తిగా కిచెన్‌షెడ్ల నిర్మాణం

- వర్షాకాలం సమీపించినా పూర్తికాని పనులు
- ప్రారంభమైన పాఠశాలలు
- వంట తయారీకి జంకుతున్న మధ్యాహ్న భోజన కార్మికులు



ఆత్మకూరు హైస్కూల్‌లో అసంపూర్తిగా నిలిచిన కిచెన్‌షెడ్డు నిర్మాణం

ఆత్మకూరు : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల, చౌళ్లపల్లి జెడ్పీహెచ్‌ఎస్‌లో మన ఊరు–మనబడి పథకంలో ఏడాది క్రితం చేపట్టిన కిచెన్‌షెడ్ల నిర్మాణ పనులు అసంపూర్తిగా నిలించిపోయాయి. గత ప్రభుత్వ హయాంలో అట్టహాసంగా ప్రారంభించినప్పటికీ వాటి నిర్వహణను ఏవరూ పట్టించుకోకపోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. దీంతో ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన తయారీ ఆరుబయటనే చేయాల్సి వస్తోంది. వర్షాకాలం ప్రారంభమవడంతో వంట చేయడం ఇబ్బందిగా మారుతుందని మధ్యాహ్న భోజన కార్మికులు వాపోతున్నారు. ఈనెల 12వ తేదీన పాఠశాలలు పునఃప్రారంభమయ్యాయి. బడిబాటలో అధికారులు, ఉపాధ్యాయులు నిమగ్నమయ్యారు. కొద్దిరోజుల్లో విద్యార్థులు పూర్తిస్థాయిలో హాజరుకానున్నారు. అసలే వర్షాకాలం, వర్షాలు జోరుగా కురిస్తే పిల్లలకు భోజనం వండిపెట్టడం పెద్ద సవాలేనని వంట కార్మికులు, స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కిచన్‌షెడ్ల నిర్మాణాలపై అధికారులు పట్టించుకోవడం లేదని వెంటనే ఉన్నతాధికారులు దృష్టిసారించాలని కోరుతున్నారు. వర్షాకాలం, ఎండకాలం మధ్యాహ్న భోజనం తయారీ చేయడం భోజన కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని, విద్యార్థుల తల్లిదండ్రులు అంటున్నారు. ఇప్పటికైనా కిచెన్‌షెడ్ల నిర్మాణాలను పూర్తిచేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

#### నిర్మాణాలు పూర్తిచేస్తాం

మండల కేంద్రంలోని హైస్కూల్‌తో పాటు మండలంలోని చౌళ్లపల్లిలో మనూరు–మన బడిలో చేపట్టిన కిచెన్‌షెడ్ల నిర్మాణాలను ఆగిపోయిన విషయం వాస్తవమే. కొద్దిరోజుల్లోనే అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా పనులు చేపట్టి పూర్తిచేస్తాం.

– శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీడీఓ

## వైద్యసిబ్బంది అందుబాటులో ఉండాలి



మాట్లాడుతున్న యాకుబ్‌పాషా

ఆత్మకూరు : ప్రాథమిక ఆరోగ్య కేంద్రంతో పాటు సబ్‌సెంటర్లలో వైద్యసిబ్బంది అందుబాటులో ఉంటూ వైద్య సేవలు అందించాలని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ యాకుబ్‌పాషా అన్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం ఆయన పరిశీలించి రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో ప్రసవాలను ప్రభుత్వ దవాఖానలోనే చేయాలన్నారు. ఆరోగ్య మహిళ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. ప్రజలకు ప్రభుత్వ వైద్యంపై నమ్మకం కలిగించేలా చైతన్య పర్చాలని సూచించారు. వైద్య సిబ్బంది విధుల పట్ల నిర్లక్ష్యం వహించొద్దని అన్నారు. మండల వైద్యాధికారిణి స్పందన, అశోక్‌రెడ్డి, మాధవరెడ్డి పాల్గొన్నారు.

## పక్కా భవనంలోకి పశువుల ఆస్పత్రి

సాక్షి ఎఫెక్ట్..

నడికూడ : మండల కేంద్రంలోని పశువైద్యశాల కోసం బీసీ కాలనీలో గల ప్రభుత్వ స్థలంలో 2017లో నూతన భవనాన్ని నిర్మించారు. ఇంతలో 2018 సంవత్సరంలో నడికూడను నూతన మండలంగా ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో మండల కేంద్రంలో ప్రభుత్వ కార్యాలయాలకు పక్కా భవనాలు లేకపోవడంతో అధికారులు, పాలకులు నూతనంగా నిర్మించిన పశువైద్యశాల భవనాన్ని తహసీల్దార్ కార్యాలయంగా వినియోగించుకున్నారు. ఇటీవల మండల కేంద్రంలో నిర్మించిన నూతన భవనంలోకి తహసీల్దార్ కార్యాలయాన్ని తరలించినా ఆ భవనం తహసీల్ ఆధ్వర్యంలోనే ఉంది. ఈ నేపథ్యంలో పశువైద్యశాలపై ఈనెల 11 వ తేదీన సాక్షి దినపత్రికలో ×పశువుల ఆస్పత్రికి పక్కా భవనం కరువు₹ అనే కథనాన్ని ప్రచురితం చేయగా అధికారులు స్పందించారు. గురువారం మండల పశువైద్యాధికారి సూరం బాలకృష్ణకు భవనం అప్పగించారు. దీంతో పక్కా భవనం నుంచి పశు వైద్య సేవలు అందనున్నాయి.

## పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- ఎమ్మెల్యే సత్యనారాయణరావు



చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

శాయంపేట : పేదల సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం వివిధ గ్రామాలకు చెందిన 114 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను ఆయన పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా ప్రభుత్వమని అన్నారు. గత పాలకుల కంటే భిన్నంగా పని చేస్తుందని, కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తోందన్నారు. కల్యాణలక్ష్మి పథకం పేదలకు వరమని, త్వరలో కల్యాణలక్ష్మి చెక్కుతో పాటు తులం బంగారం ఇచ్చేందుకు ప్రభుత్వం ప్రణాళిక రూపొందిస్తుందని వెల్లడించారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి పనులకు రూ. 270 కోట్లతో అమ్మ ఆదర్శ పాఠశాలలను అభివృద్ధి చేసిందని చెప్పారు. ప్రజాప్రతినిధులు, ఉద్యోగులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని కోరారు. భూపాలపల్లి నియోజకవర్గంలో 3500 ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయని, ఇళ్లు లేని నిరుపేదలకు ఇళ్లు కేటాయిస్తామని తెలిపారు. బాంబుల మోతతో ఇబ్బందులు పడుతున్నామని ప్రజలు తెలుపగా సమీపంలోని మూడు క్రషర్లను సీజ్ చేయించానని, ఎట్టి పరిస్థితుల్లో వాటిని మళ్లీ రీ ఓపెన్ కాకుండా చూస్తానని అన్నారు. ప్రజల సంక్షేమం కోసమే తాను పనిచేస్తానని అన్నారు. పేదలకు సంక్షేమ పథకాలు అందేలా చూస్తామని, ఎలాంటి పైరవీలు, మధ్యవర్తుల ప్రమేయం అవసరం లేదని అన్నారు. తహసీల్దార్ సుభాషిణి, ఎంపీడీఓ ఫణిచంద్ర, పార్టీ మండల అధ్యక్షుడు బుచ్చిరెడ్డి, నాయకులు చక్రపాణి, శ్రీనివాస్‌రెడ్డి, రవి, రవీందర్, మార్కండేయ. రవిపాల్, కృష్ణమూర్తితో పాటు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## యువతి అదృశ్యం



ప్రవళిక

దామెర : మండలంలోని ఒగ్లాపూర్ గ్రామంలో గల సైలానీబాబా దర్గాలో యువతి అదృశ్యమైన సంఘటన గురువారం చోటు చేసుకుంది. ఎస్సై అశోక్ తెలిపిన వివరాల ప్రకారం.. సీతారాంపురం గ్రామానికి చెందిన ఇష్టబోయిన ప్రవళిక ఆరోగ్యం బాగాలేకపోవడంతో తల్లి ప్రమీలతో కలిసి ఒగ్లాపూర్‌లోని సైలానీబాబా దర్గాకు ఈ నెల 11న వచ్చింది. ప్రవళికను ఓ దగ్గర కూర్చోబెట్టి తల్లి ప్రమీల మంచినీళ్ల కోసం వెళ్లి వచ్చేసరికి కూతురు ప్రవళిక అక్కడ కనపడకపోవడంతో కుటుంబ సభ్యులకు సమాచారం అందించింది. చుట్టుపక్కల, బంధువుల ఇళ్లలో వెతికినా ఆచూకి లభించలేదు. ప్రవళిక తండ్రి ఐలయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అశోక్ తెలిపారు. ఎవరైనా అచూకి తెలిసిన వారు వెంటనే స్థానిక పోలీస్‌లకు గాని, 100కి సమాచారం అందించాలని ఈ సందర్భంగా ఆయన కోరారు.

## విగ్రహ ఆవిష్కరణకు తరలిరావాలి



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

ఎల్కతుర్తి : భీమదేవరపల్లి మండలంలోని గాంధీనగర్, మాణిక్యాపూర్ గ్రామాల్లో ఏర్పాటు చేసిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని ఈనెల 23వ తేదీన ఆవిష్కరించనున్నట్లు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు కేడియం లింగమూర్తి తెలిపారు. ఈ సందర్భంగా గురువారం విగ్రహ ఆవిష్కరణ వాల్‌పోస్టర్లను జేఏసీ నాయకులతో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా లింగమూర్తి మాట్లాడుతూ.. విగ్రహ ఆవిష్కరణలో దళిత సంఘాల, ప్రజాసంఘాల నాయకులు, ప్రజాప్రతినిధులు, అధిక సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జేఏసీ చైర్మన్ డ్యాగల సారయ్య, తెలంగాణ అంబేడ్కర్ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి తూముల సదానందం, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రకాశ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు మేకల చేరాలు, గ్రామ శాఖ అధ్యక్షుడు అయిలయ్య, సాగర్, జగన్, రవీందర్, రాజయ్య, కుమార్, కిరణ్, అశోక్, భిక్షపతి, అరవింద్ పాల్గొన్నారు.

## 'నీట్' ఫలితాలపై విచారణ చేపట్టాలి

ఖిలా వరంగల్: నీట్ పరీక్ష ఫలితాలపై అనేక అనుమానాలు వెల్లువెత్తుతున్నాయని, దీనిపై కేంద్ర ప్రభుత్వం వెంటనే స్పందించి సమగ్ర విచారణ చేపట్టాలని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ల్యాదల్ల శరత్ డిమాండ్ చేశారు. నీట్ పరీక్ష ఫలితాలపై సిట్టింగ్ జడ్జితో తక్షణమే విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తూ వరంగల్ అండర్ బ్రిడ్జి వద్ద ఏఐఎస్‌ఎఫ్ నగర కమిటీ ఆధ్వర్యంలో ప్లకార్డులు పట్టుకుని గురువారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా ప్రభుత్వ మెడికల్ కళాశాలలో చదవడానికి నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ నిర్వహించిన నీట్ పరీక్ష రాసిన ఆరుగురు విద్యార్థులకు 720 మార్కులకు 720 మార్కులు రావడం, వారందరి పరీక్ష కేంద్రం ఒక్కటే కావడం పలు అనుమానాలకు తావిస్తోందని తెలిపారు.

## ఉమామహేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవం



గ్రామదేవత బొడ్రాయికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు

శాయంపేట : మండలంలోని మైలారం గ్రామంలో గల ఉమామహేశ్వరస్వామి దేవాలయంలో 7వ వార్షికోత్సవ ఉత్సవాలు గురువారం వైభవంగా జరిగాయి. ఆలయ అర్చకుడు గూడా వెంకట్రాం నర్సయ్య ఆధ్వర్యంలో గ్రామదేవత బొడ్రాయికి మొక్కులు చెల్లించి, స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం రుద్రాభిషేకం, అన్నంతో అలంకరించారు. సాయంత్రం శివపార్వతుల కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన అమ్మిరెడ్డి కొమురారెడ్డి జ్ఞాపకార్థం అతని కుమారుడు రాజు ఆలయ సమీపంలో మహా అన్నదానం చేపట్టారు.

## పేదింటి ప్రతిభావంతులు..

- పట్టుదలే వారికి పెట్టుబడి
- ఇంటర్‌లో రాష్ట్రస్థాయి మార్కులు
- కమలాపూర్ సర్కారు కళాశాలల విద్యార్థుల ప్రతిభ

కమలాపూర్: చదువుపై ఉన్న మమకారం, జీవితంలో ఉన్నతస్థాయికి ఎదగాలన్న ఆకాంక్షతో పేదరికాన్ని జయించి కష్టపడి చదివారు. ఇంటర్‌లో రాష్ట్రస్థాయి మార్కులు సాధించారు. ఇంటర్ ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చి అత్యుత్తమ మార్కులు సాధించిన కమలాపూర్ మండలంలోని పలు ప్రభుత్వ కళాశాలల పేద విద్యార్థులపై 'సాక్షి' కథనం.

### కూలీ బిడ్డ.. ఎంపీసీలో కేజీబీవీల స్టేట్ టాపర్..



తల్లిదండ్రులతో పావని

హనుమకొండ జిల్లా దామెర మండలం తక్కళ్లపాడుకు చెందిన మార్త సుధాకర్–లావణ్య దంపతులు రోజు వారి కూలీ పనులు చేసుకుని జీవనం సాగిస్తుంటారు. వీరి కూతురు పావని కమలాపూర్‌లోని కేజీబీవీలో ఇంటర్మీడియట్ ఎంపీసీ ప్రథమ సంవత్సరం చదువుకుంది. ఇంటర్ ఫస్టియర్ ఎంపీసీ విభాగంలో పావని 467/470 మార్కులు సాధించి ఎంపీసీ విభాగంలో కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల స్టేట్ టాపర్‌గా నిలిచింది. సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ కావాలనేది తన లక్ష్యమని, విదేశాల్లో ఒక మంచి కంపెనీలో ఉద్యోగం చేస్తూ ఉన్నత స్థాయికి ఎదిగి తనే సొంతంగా ఒక కంపెనీ స్థాపించాలని ఉందంటోంది పావని.

### రైతు బిడ్డకు 466 మార్కులు..



తల్లిదండ్రులతో చందు

కమలాపూర్ మండలం అంబాలకు చెందిన ఉడుతనబోయిన శ్రీనివాస్–సులోచన దంపతులది సాధారణ వ్యవసాయ కుటుంబం. వీరి రెండో కుమారుడు చందు కమలాపూర్‌లోని ఎంజేపీ బాలుర గురుకుల కళాశాలలో ఎంపీసీ విభాగంలో ఇంటర్ ఫస్టియర్ పూర్తి చేశాడు. ఫలితాల్లో చందు 466/470 రాష్ట్రస్థాయి మార్కులు సాధించాడు. కమలాపూర్‌లోని ఎంజేపీ బాలుర గురుకుల పాఠశాలలో చదువుకున్న చందు పదో తరగతిలో 9.7 జీపీఏ సాధించాడు. సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ కావాలనేది తన లక్ష్యమని, అందుకు అనుగుణంగా ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతున్నట్లు తెలిపాడు.

### ఇంజనీర్ కావాలనేది లక్ష్యం..



తల్లిదండ్రులతో రమ్యశ్రీ

హనుమకొండ జిల్లా నడికూడ మండలం ధర్మారానికి చెందిన పిడుగు కుమారస్వామి–సుమలత దంపతులది సాధారణ వ్యవసాయ కుటుంబం. వీరి కూతురు రమ్యశ్రీ కమలాపూర్‌లోని ఎంజేపీ బాలికల గురుకుల కళాశాలలో ఇంటర్మీడియట్ చదివి ఎంపీసీ విభాగంలో 974/1000 రాష్ట్రస్థాయి మార్కులు సాధించింది. ఇంటర్ ఫస్టియర్‌లో 461 మార్కులు సాధించిన రమ్యశ్రీ చిట్యాలలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో చదువుకుని పదో తరగతిలో 9.7 జీపీఏ సాధించింది. ఇంజనీర్ కావాలనేది తన లక్ష్యమని, ఆ దిశగా ముందుకు సాగుతున్నానంటోంది రమ్యశ్రీ.

### డాక్టర్ అవుతా..



తల్లిదండ్రులతో గణపతి

జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ మండలం పొనగల్లుకు చెందిన మాడిశెట్టి రత్నాకర్–శ్రీదేవి దంపతులది సాధారణ వ్యవసాయ కుటుంబం. వీరి కుమారుడు గణపతి కమలాపూర్‌లోని ఎంజేపీ బాలుర గురుకుల కళాశాలలో ఇంటర్మీడియట్ పూర్తి చేశాడు. ద్వితీయ సంవత్సరం బైపీసీ విభాగంలో 961/1000 మార్కులు సాధించాడు. ఫస్టియర్‌లో 414/440 మార్కులు సాధించిన గణపతి కమలాపూర్‌లోని ఎంజేపీ గురుకుల పాఠశాలలో చదివి పదో తరగతిలో 9.7 జీపీఏ సాధించాడు. డాక్టర్‌గా స్థిరపడి పేద ప్రజలకు వైద్య సేవలు అందించాలన్నది తన జీవితాశయం అంటున్నాడు గణపతి.

## జర్నలిస్టులకు క్రీడలతో పని ఒత్తిడి దూరం



జర్నలిస్టులతో ఎంపీ, ఎమ్మెల్యే, తదితరులు



3కే రన్‌ను ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు

కేయూ క్యాంపస్: నిత్యం బిజీబిజీగా ఉండే జర్నలిస్టులకు క్రీడలతో పని ఒత్తిడి కాస్త దూరమవుతుందని వరంగల్ ఎంపీ కడియం కావ్య అన్నారు. గ్రేటర్ వరంగల్ ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో జర్నలిస్టులకు క్రికెట్ పోటీలను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జర్నలిస్టుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషిచేస్తానని తెలిపారు. వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు మాట్లాడుతూ జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించేందుకు సీఎం రేవంత్‌రెడ్డి సిద్ధంగా ఉన్నారని చెప్పారు. మాజీ మేయర్ ఎర్రబెల్లి స్వర్ణ మాట్లాడుతూ తాను మేయర్‌గా పనిచేసినప్పుడు జర్నలిస్టుల సంక్షేమానికి శాయశక్తులా కృషి చేశానని ఆమె గుర్తుచేశారు.

#### ప్రెస్ క్లబ్ నుంచి ఆర్ట్స్ కళాశాల వరకు 3కే రన్

గ్రేటర్ వరంగల్ ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో స్పోర్ట్స్‌మీట్–2024 ప్రారంభం సందర్భంగా తొలుత గురువారం ఉదయం7 గంటలకు హనుమకొండలోని ప్రెస్ క్లబ్ నుంచి 3కే రన్‌ను నిర్వహించారు. ఈ రన్‌ను ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యే నాగరాజు, కాంగ్రెస్ వరంగల్ జిల్లా అధ్యక్షురాలు, మాజీ మేయర్ ఎర్రబెల్లి స్వర్ణ, ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు వేముల నాగరాజు, జనరల్ సెక్రటరీ బొల్లారపు సదయ్య, కోశాధికారి అమర్ జెండా ఊపి ప్రారంభించారు. టీయూడబ్ల్యూజే (ఐజేయూ) హనుమకొండ జిల్లా అధ్యక్షుడు గడ్డం రాజిరెడ్డి, ప్రధాన కార్యదర్శి తోట సుధాకర్, టీయూడబ్ల్యూజే (హెచ్) 143 వరంగల్ జిల్లా అడ్‌హక్ కమిటీ కన్వీనర్ కక్కెర్ల అనిల్‌కుమార్, ప్రెస్‌క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

## సీసీఐ వరంగల్ జీఎం అరుణ్‌దేవ్‌కు సన్మానం



జీఎంను సన్మానిస్తున్న కాటన్ ఇండస్ట్రీ యజమానులు

వరంగల్: కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా వరంగల్ బ్రాంచ్ డిప్యూటీ జనరల్ మేనేజర్‌గా పనిచేస్తున్న అరుణ్ ఎస్.దేవ్ ఇటీవల జనరల్ మేనేజర్‌గా పదోన్నతి పొందారు. ఈమేరకు ఆయనకు వరంగల్ కాటన్ మిల్లర్స్ అండ్ ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు చింతలపల్లి వీరారావు ఆధ్వర్యంలో కాటన్ ఇండస్ట్రీస్ యజమానులు పూలబొకేలు అందజేసి సన్మానించారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కట్కూరి నాగభూషణం, ఉపాధ్యక్షుడు పింగిలి మల్లారెడ్డి, సంయుక్త కార్యదర్శి కట్కూరి శ్రీమన్నారాయణ, కూకట్ల సత్యనారాయణ, అరకాల శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

## బీసీల మహా ధర్నాను విజయవంతం చేయాలి



న్యూశాయంపేట: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల హామీల్లో భాగంగా కామారెడ్డి సభ డిక్లరేషన్‌లో పొందుపరిచిన కుల గణన, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్ అమలు వంటి అంశాల సాధన కోసం ఈనెల 15న హైదరాబాద్ ఇందిరాపార్కు వద్ద బీసీ ఐక్య కులసంఘాల వేదిక ఆధ్వర్యంలో మహాధర్నాను నిర్వహించనున్నట్లు ఆల్ ఇండియా ఓబీసీ జేఏసీ చైర్మన్ సాయిని నరేందర్ పిలుపునిచ్చారు. ఈమేరకు బీసీల మహా ధర్నాను విజయవంతం చేయాలని కోరారు. హనుమకొండ బాలసముద్రం సీపీఐ జిల్లా కార్యాలయంలో గురువారం జరిగిన బహుజన సంఘాల రౌండ్ టేబుల్ సమావేశానికి హాజరై ఆయన మాట్లాడారు. సమావేశంలో సంఘాల నాయకులు డాక్టర్ కొంగ వీరస్వామి, ప్రొఫెసర్ కూరపాటి వెంకటనారాయణ, కొంతం కృష్ణ, కూనూర్ రంజిత్‌గౌడ్, ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.